ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



వారి కులంపై లోతుగా విచారణ జరపండి!
- సహేతుక సమయంలో ఉత్తర్వులివ్వండి
- నిర్దిష్ట నిర్ణయం ఎందుకు చెప్పలేదు?
- దళితులకు శిరోముండనం కేసులో కాకినాడ కలెక్టర్ తీరుపై హైకోర్టు ఆగ్రహం

- 7లో



తెగ తాగేశారు!



జిల్లాలో మందుబాబులు రెచ్చిపోయారు. కొత్త సంవత్సరం పేరుతో డిసెంబరు 31 రాత్రి తెగ తాగేశారు. వేలాది బీర్లు, వందలాది మద్యం బాటిళ్లు లేపేశారు. నాన్ స్టాప్‌గా ఊది పాడేశారు. దీంతో ఈ ఒక్కరోజు జిల్లాలో మద్యం విక్రయాలు ఏకంగా రూ.7.50 కోట్లు జరిగాయి. ఒకరకంగా ఇది రికార్డే. సాధారణ రోజుల్లో జిల్లాలో రోజుకు రూ.3 కోట్ల వరకు మద్యం అమ్ముడవుతుంది. కానీ డిసెంబర్ 31 రాత్రి మాత్రం రెండింతలకుపైగా విక్రయాలు జరిగాయి. దీంతో ఎక్సైజ్ శాఖకు కాసులు గలగలలాడాయి. అంతకుముందు ఏడాది అంటే 2022 డిసెంబర్ 31రోజు జిల్లాలో మద్యం అమ్మకాలు రూ.6.53 కోట్లు కాగా, ఈసారి 2023 డిసెంబరు 31న మరింత పెరిగాయి. ఇదిలాఉంటే 2023 ఏప్రిల్ నుంచి డిసెంబర్ 31వరకు జిల్లావ్యాప్తంగా ఏకంగా రూ.855 కోట్లు మద్యం అమ్ముడైంది.

- డిసెంబరు 31 రాత్రి తెగ రెచ్చిపోయిన మందుబాబులు
- జిల్లావ్యాప్తంగా ఏకంగా రూ.7.50 కోట్ల విలువైన మద్యం ఊదేశారు
- ఒక్కరోజులో 42,384 బీర్లు, 5263 ఐఎంఎల్ మందుబాటిళ్లు ఖాళీ
- 2022 డిసెంబర్ 31 విక్రయాలు రూ.6.53 కోట్లతో పోల్చితే ఎక్కువే
- అర్ధరాత్రి ఒంటి గంట వరకు విక్రయాలకు పర్మిషన్‌తో రోడ్ల మీదే మందుబాబులు
- ఈ ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు రూ.855 కోట్ల మద్యం ఉఫ్
- సంక్రాంతి సమీపిస్తున్న నేపథ్యంలో భారీగా స్టాకు సిద్ధం చేస్తున్న అధికారులు
- పండగ మూడ్రోజుల్లో రూ.150 కోట్ల సరుకు విక్రయమవుతుందని అంచనా

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

సందర్భం ఏదైనా సరే మందుబాబులకు కిక్కు ఉండాల్సిందే. అదే డిసెంబర్ 31 అయితే ఇంక చెప్పక్కర్లేదు. ఆరోజు ఎలాగైనా మందు ముట్టాల్సిందేనని శపథం పూనుతారు. రోజు వారీ తాగేదానికంటే ఆ రోజు రెట్టింపు సీసాలు ఖాళీ చేసేస్తారు. అచ్చం ఆదివారం జిల్లాలో డిసెంబర్ 31 సందర్భంగా ఇదే జరిగింది. జిల్లావ్యాప్తంగా మందుబాబులు తెగ రెచ్చిపోయి తాగేశారు. ప్రభుత్వం కూడా అర్ధరాత్రి వరకు విక్రయాలు చేయడంతో ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు మద్యం దుకాణాలు, బార్లు, వాక్‌ఇన్‌స్టోర్ల వద్ద సందడి చేస్తూనే ఉన్నారు. ఫలితంగా మద్యం విక్రయాలు ఈ ఒక్క రోజులో రయ్‌మన్నాయి. ఏకంగా జిల్లావ్యాప్తంగా 157 మద్యం దుకాణాల్లో ఒక్క రోజు అమ్మకాలు రూ.7.50 కోట్లు నమోదయ్యాయి. ఇందులో ఒక్క బీర్లే 42,384 సీసాలు ఖాళీ చేసేశారు. బ్రాందీ, విస్కీ, రమ్ము, ఇతర మద్యం బాటిళ్లకు సంబంధించి 5,263 ఐఎంఎల్ కేసులు అమ్ముడుపోయాయి. డిసెంబరు 31న జరిగిన విక్రయాల్లో సగం వరకు దాదాపు కాకినాడ నగరంలోనే ఉన్నట్టు గుర్తించారు. ఒకరకంగా ఇప్పటివరకు డిసెంబరు 31న ఈ స్థాయి విక్రయాలు జరగడం ఇదే తొలిసారిగా అధికారులు చెబుతున్నారు. సాధారణ రోజుల్లో జిల్లావ్యాప్తంగా అన్ని మద్యం దుకాణాల్లో కలిపి రోజుకు రూ.3కోట్లు, ఆదివారాల్లో రూ.3.50కోట్ల వరకు మద్యం విక్రయాలు జరుగుతాయి. కానీ డిసెంబరు 31 సందర్భంగా ఏకంగా రూ.7.50 కోట్ల విలువైన సరుకు అమ్ముడుపోయింది. అయితే ఆరోజు అమ్మకాలు అనూహ్యంగా పెరగడంతో అనేక మద్యం దుకాణాల్లో స్టాకు కూడా ఖాళీ అయిపోయింది. దీన్నిబట్టి చూస్తే న్యూ ఇయర్ పేరుతో మందుబాబులు ఎంత భారీగా తాగేశారో అర్థం చేసుకోవచ్చు. ఇదిలాఉంటే 2022 డిసెంబరు 31న జిల్లాలో రూ.6.53 కోట్ల మందు అమ్ముడయింది. ఇందులో 40,128 బీరు సీసాలున్నాయి. దీన్నిబట్టి అప్పటితో పోల్చితే ఈ దఫా డిసెంబర్ 31న మందు ఊదుడు పెరిగింది. కాగా డిసెంబరు నెలలో జిల్లాలో మద్యం విక్రయాలు రూ.98 కోట్లు నమోదయ్యాయి. ఇందులో 3,13,308 బీరు సీసాలు అమ్ముడవగా, ఐఎంఎల్ కేసులు 76,735 విక్రయాలు జరిగాయి. అదే 2022 డిసెంబరు నెలలో జిల్లాలో మొత్తం మద్యం విక్రయాలు ఏకంగా రూ.100.65 కోట్లు దాటేశాయి. అలాగే జిల్లాలో 2023 ఏప్రిల్ 1 నుంచి డిసెంబరు 31 వరకు మందుబాబులు మొత్తం రూ.886 కోట్లు విలువైన మద్యాన్ని తాగేశారు. ఇందులో ఒక్క బీర్లే 36.88లక్షల బీర్లున్నాయి. ఐఎంల్ కేసులు 6.33 లక్షలు. అంతకుముందు ఏడాది 2022 ఏప్రిల్1 నుంచి డిసెంబరు 31వరకు జరిగిన మద్యం విక్రయాలు రూ.887 కోట్లు కావడం విశేషం. ఇదిలాఉంటే మరికొద్దిరోజుల్లో సంక్రాంతి రాబోతోంది. ఈ నేపథ్యంలో విక్రయాలు పెంచుకోవడానికి కోసం అప్పుడే ప్రభుత్వం భారీ ఎత్తున మందు సిద్ధం చేస్తోంది. రకరకాల బ్రాండ్లను సైతం కొత్తగా దించబోతోంది. అసలే ఎన్నికల ఏడాది కావడంతో అధికార పార్టీ నుంచి మందుబాబులకు ఆర్థికంగా అండదండలు కూడా అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో భారీగా స్టాకును డిపోలు సిద్ధం చేస్తున్నాయి. దీంతో జిల్లాలో సంక్రాంతి మూడు రోజులు రూ.150 కోట్లకుపైగా మద్యం విక్రయాలు జరుగుతాయని అంచనా వేస్తున్నారు. మొత్తానికి అర్ధరాత్రి దాకా మద్యం విక్రయాలు సర్కారు గల్లా పెట్టెను నింపేశాయి.



ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ తదితరులు

రేపు సీఎం పర్యటన

ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

కాకినాడసిటీ, జనవరి1: వైఎస్సార్ పెన్షన్ కానుక పెంపు కార్యక్రమంలో భాగంగా ఈనెల 3న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కాకినాడలో పర్యటించనున్న నేపథ్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా.. ఎస్పీ ఎస్ సతీష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియా, సీఎం భద్రతా సిబ్బంది, ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ డీఎస్పీ రంగబాబు, ఇతర అధికారులతో కలిసి కాకినాడ పోలీస్ క్రీడా మైదానంలో హెలిప్యాడ్ వద్ద బార్కేడ్లు, వైద్య శిబిరం, స్పందన కౌంటర్, ప్రజాప్రతినిధులు వేచి ఉండే వీఐపీ గేలరీ ఏర్పాట్లను పరిశీలించారు. పోలీస్ క్రీడా మైదానం నుంచి రంగరాయ వైద్య కళాశాల క్రీడా మైదానం వరకు సీఎం పాల్గొనే రోడ్‌షోలో భాగంగా చేపట్టాల్సిన ఏర్పాట్లను పోలీస్, ట్రాఫిక్, డ్వామా, రోడ్లు భవనాలు, ట్రాన్స్‌కో, అగ్నిమాపక, వైద్య ఆరోగ్యం, ఆర్టీసీ, మున్సిపల్ కార్పొరేషన్, టౌన్ ప్లానింగ్, జిల్లా పరిషత్ తదితర శాఖల అధికారులతో కలిసి పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం రంగరాయ వైద్య కళాశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన సభా వేదిక వద్ద పనులను, సీఎం బహిరంగ సభకు లబ్ధిదారుల తరలింపు, మీడియా పాయింట్, పబ్లిక్ గేలరీ, స్టాల్స్ ఏర్పాటు పనులను సీఎం పర్యటనల సమన్వయకర్త తలశిల రఘురాం, జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి, ఏపీ భూదాన పరిషత్ చైర్మన్ టి భాస్కరరెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పర్యవేక్షించి సీఎం పర్యటనపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.

తుని టీడీపీలో బయటపడ్డ వర్గవిభేదాలు

న్యూఇయర్ వేడుకల్లో కృష్ణుడు, రాజేష్ వర్గాల మధ్య రచ్చ

ఇరువర్గాల మధ్య తోపులాట, ఘర్షణ

తుని రూరల్, జనవరి1: తుని టీడీపీలో అంతర్గతంగా కొనసాగుతున్న వర్గ విభేదాలు బయటపడ్డాయి. తుని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి యనమల దివ్య ఆధ్వర్యంలో తుని పట్టణ శివారు సాయివేదికలో నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. కార్యక్రమానికి ప్రతిపక్ష నేత, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడుతో పాటు రాష్ట్ర టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు హాజరయ్యారు. నియోజకవర్గ నలుమూలల నుంచి టీడీపీ శ్రేణులు తమ అభిమాన నేతలకు శుభాకాంక్షలు తెలిపేందుకు తరలివచ్చారు. అందులో భాగంగా మాజీ మంత్రి యనమల కుటుంబీకుడైన యనమల రాజేష్ తన అనుచరగణంతో శుభాకాంక్షలు తెలిపేందుకు సాయివేదికకు చేరుకున్నారు. మాజీ మంత్రి యనమలను కలిసేందుకు వెళుతున్న మార్గం విషయంలో కృష్ణుడు అనుచరులు, రాజేష్ అనుచరుల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో ఇరువర్గాలు తోపులాటకు సైతం దిగారు. వాస్తవానికి ఈ రెండు వర్గాల మధ్య కొంతకాలంగా అంతర్గత పోరు నడుస్తోంది. ఈ వేడుకలో పోరు బయటపడడంతో చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారం కాస్తా కాకినాడలోని మాజీ మంత్రి యనమల నివాసానికి చేరింది. అనుచరులతో మంతనాలు అనంతరం కృష్ణుడు తన అనుచరులను వెంటపెట్టుకుని కాకినాడకు వెళ్లారు. పార్టీకోసం అహర్నిశలు పార్టీ కోసం పనిచేసిన వాళ్లం.. మీ ఉన్నతికి ఆది నుంచి పాటుపడినవాళ్లమని కృష్ణుడు మాజీ మంత్రి యనమలతో చెబుతూ నియోజకవర్గంలో సముచిత స్థానం ఇవ్వాలని కోరినట్టు సమాచారం. అంతేగాని మరెవ్వరి ఆధిపత్యం అంగీకరించబోమని కృష్ణుడు వర్గం ఆయనకు తెగేసి చెప్పినట్టు తెలిసింది.



న్యూఇయర్ వేడుకల్లో ఇరువర్గాలు ఘర్షణ పడుతున్న దృశ్యం

నూతన సంవత్సరం సందర్భంగా యనమలను కలిసిన

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జులు, నాయకులు



యనమలను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జులు

కాకినాడ సిటీ, జనవరి1: 2024 నూతన సంవత్సరం ఆరంభం సందర్భంగా తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడును సోమవారం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిలు కొందరు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు యనమలను కలిసిన వారిలో కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావులతోపాటు కాకినాడ రూరల్ నియోజకవర్గ నాయకులు పేరాబత్తుల రాజశేఖర్, వాసిరెడ్డి ఏసుదాసు తదితరులున్నారు.

వ్యక్తి నిర్బంధంపై వివాదం

- వైసీపీ నుంచి టీడీపీలోకి మారే ప్రయత్నాన్ని సహించలేక దాడి
- పైగా గాయపడిన వ్యక్తినే విచారణ పేరిట పోలీసు స్టేషన్‌కు తరలింపు
- పోలీసులపై టీడీపీ ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆగ్రహం
- ఎట్టకేలకు నల్లమిల్లి పూచీకత్తుతో విడుదల

- 7లో

వైద్య విద్యార్థులకు తీవ్రగాయాలు

- 7లో

పాలకుల మంకుపట్టుతో

పౌష్టికాహారం ఎలుకల పాలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో కుళ్లుతున్న గుడ్ల నుంచి దుర్వాసన

ఇతర ఆహార పదార్థాలపై ముసురుకుంటున్న ఈగలు

చిన్నారుల ఆరోగ్యానికి ప్రమాదం

అంగన్‌వాడీల సమ్మెపై స్పందించని ప్రభుత్వం

చిన్నారులకు, బాలింతలకు అందని బలవర్ధక ఆహారం



మామిడికుదురులో ప్రభుత్వ చీరలకు పూజలు చేస్తూ నిరసన

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఎంత మంది ఇబ్బంది పడినా మా మంకుపట్టు మాదే అంటే పాలకులు బెట్టు వీడడం లేదు. చివరికి గర్భిణులు, బాలింతలు, చిన్నారుల పౌష్టికాహారంతో ముడిపడి ఉన్న విషయంలోనూ ప్రభుత్వం కాలయాపననే నమ్ముకోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నా అవేమి పట్టించుకోవడం లేదు. అంగన్వాడీలు 19 రోజులుగా తమ డిమాండ్ల సాధనకు పోరాడుతున్నారు. గత ఎన్నికల వేళ అక్కచెల్లెమ్మలంటూ ప్రేమ ఒలకబోసిన సీఎం జగన్ ఇప్పుడు అంగన్వాడీ మహిళలను ముప్పుతిప్పలు పెడుతున్నారు. అంగన్వాడీల సమ్మెతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందడంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయనే స్పృహ కూడా ప్రభుత్వానికి లేకుండా పోయింది. లబ్ధిదారులు అంగన్వాడీలకే మద్దతు పలుకుతున్నా పాలకులకు మాత్రం వారి సమస్యలు కానరావడం లేదు. దీంతో పౌష్టికాహారం ఎలకలపాలవుతోంది. అంగన్వాడీలను భయపెట్టడానికి వలంటీర్లు, సచివాలయ సిబ్బందిని అంగన్వాడీ సెంటర్లకు పంపిస్తున్నా ఎటువంటి ప్రయోజనం కనిపించడం లేదు. 19 రోజులుగా సెంటర్లకు గర్భిణులు, బాలింతలు, పిల్లలు రావడం లేదు. ప్రభుత్వ తీరుపై అవగాహన చేసుకోలేని వయసులో ఉన్న పిల్లలు అంగన్వాడీ కేంద్రాలకు తీసుకెళ్లాలని మారాం చేస్తున్నారు. ఓ కానిస్టేబుల్‌కి కూడా ఈ పరిస్థితి ఎదురైంది. అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు ఉన్నప్పుడు లబ్ధిదారులకు అందాల్సిన పౌష్టికాహారాన్ని నిర్దేశిత సమయం ప్రకారం అందజేసేవారు. ఇప్పుడు ఆ క్రమం తప్పింది. కేంద్రాల్లో మిగిలిన/కొత్తగా వచ్చిన గుడ్లు కుళ్లిపోయి దుర్వాసన వస్తోంది. ఈగలు విపరీతంగా ముసురుకుంటున్నాయి. ఈ ప్రభుత్వం వచ్చాక అంగన్వాడీ కేంద్రాలను ప్రాథమిక పాఠశాలలకు తరలించారు. దీంతో ఆ పాఠశాలల్లోని పిల్లలకు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఏర్పడింది. కందిపప్పు, బాలసంజీవిని, పల్లీల అచ్చులను ఎలుకలు ఎంచక్కా ఆరగిస్తున్నాయి. ఈ నెలలో మొదటి ఫేజ్‌లో వచ్చిన సరుకులను లబ్ధిదారులకు అంగన్వాడీలు అందజేసిన అనంతరం సమ్మెలో దిగారు. రెండో ఫేజు సరుకుల పంపిణీ తారుమారైంది. అంగన్వాడీ కేంద్రాలను ఇప్పుడు కనీసం శుభ్రం కూడా చేయడం లేదు. వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో ప్రభుత్వం కేంద్రాల తాళాలను బద్దలు కొట్టించింది. కానీ, వాటికి కొత్త తాళాలు లేక ప్రస్తుతం అధిక శాతం కేంద్రాలకు తాళాలు వేయడం లేదు. దీంతో కేంద్రాల్లోని ఆట వస్తువులు, ఫర్నీచర్ వంటివి దొంగలపాలు అవుతాయని అంగన్వాడీలు ఆవేదన చెందుతున్నారు. 2020లో తాము సొంత డబ్బుతో తయారు చేసిన ప్రీస్కూల్ కిట్లు, ఆటపాట వస్తువులు సెంటర్లలో ఉన్నాయని చెబుతున్నారు. కాగా.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుమారు 5000 అంగన్‌వాడీ సెంటర్లు ఉండగా తూర్పుగోదావరి జిల్లాలో 1556 సెంటర్లు ఉన్నాయి. ఏడెనిమిది నెలల నుంచీ గ్యాస్ సిలిండర్ల బిల్లులు కూడా అంగన్వాడీలకు చెల్లించడం లేదు.

● పౌష్టికాహారం ఇలా

గర్భిణులు, బాలింతలకు నెలలోని 1 నుంచి 6వ తేదీ వరకూ మొదటి విడత, 10-20లోపు రెండో, 20-31లోపు మూడో విడత కింద 1-15వ తేదీలోపు ఒక్కొక్కరికి 13 గుడ్లు, రెండున్నర లీటర్ల పాలు, బాలసంజీవిని కిట్ (కర్జూరం 250 గ్రా, బెల్లం 250 గ్రా, పల్లీల అచ్చు 250 గ్రా, రాగిపిండి 2 కిలోలు, అటుకులు 1కిలో), బియ్యం 3 కిలోలు, కందిపప్పు కిలో, వంటనూనె అర లీటరు. రెండో విడత పంపిణీ కింద 16-30వ తేదీలోపు 12 గుడ్లు, రెండున్నర లీటర్ల పాలు ఇస్తారు. మొత్తంగా నెలకు బాల సంజీవిని కిట్ 1, ఎగ్స్ 25, పాలు 5 లీటర్లు రైస్ 3 కిలోలు, కందిపప్పు కిలో, వంటనూనె అరలీటరు అందజేస్తారు. 6 నెలల నుంచి 3 ఏళ్లలోపు పిల్లలకు నెలకు 25 గుడ్లు, రెండున్నర లీటర్ల పాలు, బాలామృతం ప్యాకెట్ ఇస్తారు. 3-5 ఏళ్లలోపు ప్రీస్కూల్ పిల్లలకు రోజూ గుడ్డు, పప్పుతో భోజనం, 100 మిల్లీ లీటర్ల పాలు ఇస్తారు.

సీఎం, మంత్రుల పేర్ల మంత్రాలతో

అంగన్‌వాడీల పూజలు

● నాసిరకం చీరల ప్రదర్శన

● పి.గన్నవరంలో వినూత్న నిరసన



మంత్రాలతో పూజలు చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

పి.గన్నవరం, జనవరి 1: ఓం జగన్మోహరెడ్డి నమః, ఓం బొత్సాయన నమః, ఓం సజ్జల రామకృష్ణారెడ్డి నమః, తాడేపల్లి ప్యాలెస్ నమః, ఆకలి మంటాయ నమః అంటూ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో అంగన్‌వాడీలు వినూత్నంగా చీరలు, సెల్‌ఫోన్ల పసుపు, కుంకుమతో పూజలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వం అందించిన నాసిరకం చీరలను ప్రదర్శించారు. పి.గన్నవరం-నరేంద్రపురం రోడ్డు మధ్యలో కేక్ కట్ చేసి నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విప్లవ గీతాలు ఆలపిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంగన్‌వాడీల నిరవధిక సమ్మెకు ఎస్టీయూ మండల శాఖ నాయకులు సంఘీభావం తెలిపారు. జిల్లా అంగన్‌వాడీ వర్కర్లు, సహాయకుల అధ్యక్షురాలు బండి వెంకటలక్ష్మి, కె.నాగలక్ష్మి, మట్టపర్తి వెంకటలక్ష్మి, లక్ష్మీకుమారి, కె.కిరణ్మయి, జి.వెంకటరమణ, జె.పద్మమాల, డి.లలిత, కె.వెంకటలక్ష్మి, వరహాలక్ష్మి, అత్తిలి ఉమాశంకరి, బెహర బేబిఆశాలత, ఎన్.మీనాక్షి, కె.గంగారత్నం తదితరులు పాల్గొన్నారు.



నాసిరకం చీరలను ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కోడి పందేల శిబిరంపై పోలీసుల దాడులు

ఎటపాక, జనవరి 1: నూతన సంవత్సరం సందర్భంగా కోడి పందేలు నిర్వహిస్తున్న స్థావరంపై సోమవారం పోలీసులు దాడి చేశారు. గొమ్ముకొత్తగూడెం పంచాయతీ పరిధిలోని ఎర్రబోరు గ్రామ శివారు ప్రాంతంలో కోడి పందేల బరి నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దాంతో పోలీసులు బరి ఏర్పాటు చేసిన ప్రాంతంలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, రెండు పందెం కోళ్లతో పాటు రూ.1200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కె.పార్థసారథి తెలిపారు. సంక్రాంతి పండుగ పేరుతో కోడి పందేలు, జూదాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ పార్థసారథి హెచ్చరించారు.

జనసంచారంలోకి మొసలి పిల్ల



మోతుగూడెం, జనవరి1: చింతూరు మండలం మోతుగూడెం జగదాంబ సెంటర్లో జన సంచారంలోకి మొసలి పిల్ల రావడంతో గ్రామస్థులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. జగదాంబ సెంటర్ కాలనీ వాసులు ఫారెస్ట్ అధికారులకు ఫోన్ చేయడంతో ఫారెస్ట్ అధికారులు దానిని పట్టుకుని పెద్దవాగులో వదిలేశారు.

లారీ ఢీకొని యువకుడి మృతి



రోడ్డుపై పడి ఉన్న క్షతగాత్రులు

జగ్గంపేట, జనవరి 1: కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రామవరంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. రామవరం గ్రామానికి చెందిన కొండేపూడి నవీన్, కల్యాణం చిన్న, సింగర్ల మహేష్‌బాబు స్థానిక ముమ్మిడివరపు నారయ్య సప్లయ్ కంపెనీలో పనిచేస్తున్నారు. కంపెనీలో జరిగే నూతన సంవత్సర వేడుకల కోసం నవీన్ మిగిలిన ఇద్దరితో కలిసి మోటారు సైకిల్‌పై జగ్గంపేటకు బిర్యానీ పార్శిల్ కోసం బయలుదేరారు. రాజమండ్రి నుంచి విశాఖ వైపు వెళ్తున్న లారీ ఢీ కొనడంతో వారు రోడ్డుపై పడ్డారు. నవీన్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే చనిపోయాడు. ఈ కేసును జగ్గంపేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

శీతాకాలం సోయగాలు



కడియం, జనవరి 1: శీతాకాలం వచ్చిందంటే చాలు కడియం నర్సరీల్లో రకరకాల సీజనల్ పుష్పాలు కనువిందు చేస్తాయి. ఈ కాలంలో చలి పెరిగే కొద్దీ మొక్కలు మరింత ఆకర్షణీయంగా పెరుగుతాయి. మొక్కలపై మక్కువ ఉన్న వన ప్రేమికులు ఈ కాలంలో సీజనల్ పుష్పాలు పెంచడానికే ఎక్కువ ఆసక్తి కనబరుస్తారు. బంతి, చామంతి, వింకారోజ్, డైజీ, డయాంతస్, జెనియా, పిటోనియా, డస్ట్‌మిల్లర్, గజేనియా, క్రైసాంతిమం, స్ట్రాబెర్రీ, మినీడాలియా, సాల్వియా తదితర రకరకాల సీజనల్ పూలు శీతకాలంలో కనువిందు చేస్తాయి. కొద్దిపాటి జాగా ఉన్న ఇంటి పెరటిలోను, ఇంటిలోపల టీవీ, టీపాయ్ వంటి వాటిపైన, మరికొంత మంది హేంగింగ్ పాట్స్‌గాను ఈ మొక్కలను పెంచుతుంటారు. నర్సరీ రైతులు సెప్టెంబరులో ఈ సీజనల్ పుష్పాలు పెంచడం ప్రారంభిస్తారు. ఈ పుష్పాలు నవంబరు మాసం నుంచి ఫిబ్రవరి వరకు ఉంటాయి. ఈ సీజన్‌లోనే క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి, మహాశివరాత్రి వంటి పండుగలు రావడం, నర్సరీలను తిలకించేందుకు నర్సరీలకు సందర్శకుల తాకిడి ఉండటంతో ప్రతి నర్సరీలోను రైతులు సీజనల్ పుష్పాల పెంపకంపై దృష్టి సారిస్తారు.

వారి కులంపై లోతుగా విచారణ జరపండి

సహేతుక సమయంలో ఉత్తర్వులివ్వండి

నిర్దిష్ట నిర్ణయం ఎందుకు చెప్పలేదు?

దళితులకు శిరోముండనం కేసులో

కలెక్టర్ తీరుపై హైకోర్టు ఆగ్రహం

అమరావతి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): శిరోముండనం కేసులో బాధితులు కోటి చినరాజు, డి.వెంకటరమణ ఫలానా కులం వారని కలెక్టర్ నిర్దిష్ట నిర్ణయాన్ని వెల్లడించకపోవడంపై హైకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. వారి కులం వ్యవహారంలో తాజాగా లోతైన విచారణ జరిపి చట్టనిబంధనల మేరకు తగిన ఉత్తర్వులు జారీ చేయాలని కాకినాడ జిల్లా కలెక్టర్, జిల్లా స్థాయి స్క్రూటినీ కమిటీ చైర్మన్(జాయింట్ కలెక్టర్)ను ఆదేశించింది. బాధితుల కుల ధ్రువీకరణ పత్రం విషయంలో జిల్లా కలెక్టర్ 2019 జూన్ 11న జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేసింది. మరోసారి కుల ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకునేందుకు బాధితులకు వెసులుబాటు కల్పించింది. వారి దరఖాస్తులపై సహేతుక సమయంలో నిర్ణయాన్ని వెల్లడించాలని జిల్లా కలెక్టర్, స్క్రూటినీ కమిటీకి స్పష్టం చేస్తూ న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఇటీవల ఉత్తర్వులు ఇచ్చారు. దళిత యువకులకు శిరోముండనం చేసిన ఘటనలో తూర్పుగోదావరిజిల్లా ద్రాక్షారామ పోలీసులు 1997లో ఎస్సీ, ఎస్టీ చట్టంతో పాటు ఇతర సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో ప్రస్తుత వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మరికొందరిని నిందితులుగా పేర్కొన్నారు. అయితే బాధితులు కోటి చినరాజు, డి.వెంకటరమణ ఎస్సీ సామాజిక వర్గానికి చెందినవారు కాదని, తమ వాదనలు పరిగణలోకి తీసుకోకుండా 2019 జూన్ 11న జిల్లా కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని జీవరత్నం, మరో వ్యక్తి అదే ఏడాది జూన్ 25న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల ఇరు పక్షాలు తమ వాదనలు వినిపించాయి. వీటిని పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. చట్టనిబంధనల ప్రకారం బాధితులు ఫలానా కులంవారని ఆమోదించడమో లేదా తిరస్కరించడమో నిర్దిష్ట నిర్ణయం వెల్లడించాల్సిన బాధ్యత కలెక్టర్‌పై ఉందని గుర్తు చేశారు. బాధితుల కులధ్రువీకరణ ఉత్తర్వులను పరిశీలిస్తే.. యథాతథస్థితి పాటించాలని పేర్కొన్నారు తప్ప నిర్దిష్ట ఆదేశాలు ఇవ్వలేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆ ఉత్తర్వులకు చట్టబద్ధత లేదని, వాటిని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. బాధితుల కులం విషయంలో లోతైన విచారణ జరిపి చట్టనిబంధనల మేరకు సహేతుకమైన సమయంలో ఉత్తర్వులివ్వాలని నిర్దేశించారు.

రత్నగిరిపై చాగంటి ప్రత్యేక పూజలు



చాగంటి కోటేశ్వరరావుకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న అధికారులు

అన్నవరం, జనవరి 1: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో సోమవారం నూతన ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకుని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త చాగంటి కోటేశ్వరరావు కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ పీఆర్వో కృష్ణారావు, పండితులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందించగా పీఆర్వో స్వామివారి ప్రసాదం, మెమెంటో అందజేశారు. నూతన సంవత్సరం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. సుమారు 25 వేల మంది దర్శించుకున్నారని అధికారులు చెప్పారు.

సిద్ధి వినాయకుని ఆలయానికి పోటెత్తిన భక్తులు



పుష్పాలంకరణలో స్వామి



స్వామివారిని దర్శించుకుంటున్న గిడుగు రుద్రరాజు

అయినవిల్లి, జనవరి 1: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి సిద్ధివినాయక ఆలయం నూతన ఆంగ్ల సంవత్సరం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. సోమవారం ఆంగ్ల సంవత్సరం ఆరంభం రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా తీర్చిదిద్దారు. పీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు సిద్ధి వినాయకుని దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు.

రేపు అంతర్వేది ఫిషింగ్ హార్బర్‌కు

కేంద్రమంత్రి రాక

మత్స్యకారులతో సమావేశం

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించనున్న

కేంద్ర మంత్రి రూపాల పురషోత్తం

అంతర్వేది, జనవరి 1: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది మినీ ఫిషింగ్ హార్బరుకు ఫిషరీస్, యానిమల్ హాస్బెండరీ, డైరింగ్‌శాఖ కేంద్ర మంత్రి రూపాల పురుషోత్తం బుధవారం విచ్చేస్తారు. మత్స్యకారులతో సమావేశమై కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తారని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్ తెలిపారు. ఈ సదస్సుకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ.వేమా, జిల్లా ఇన్‌చార్జి పొట్లూరి రామ్మోహనరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడబాల సత్యనారాయణ, నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, రాష్ట్ర కిసాన్ మోర్చా డ్రైనేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు, పార్టీ మండల అధ్యక్షుడు పట్నాపు సూర్యప్రకాశరావు పాల్గొంటారు. కేంద్ర మంత్రి పర్యటన నేపథ్యంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

స్నాతకోత్సవం నిర్వహణకు సన్నాహాలు



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

జేఎన్టీయూకే, జనవరి 1: కాకినాడ జేఎన్టీయూకే 10వ స్నాతకోత్సవం నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నామని ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. వర్సిటీ అకడమిక్, ఆడిట్ డైరెక్టర్, పీఆర్వో సీహెచ్ సాయిబాబు అధ్యక్షతన నిర్వహించిన విశ్వవిద్యాలయం 2024 నూతన క్యాలెండర్, డైరీ, న్యూస్ మ్యాగజైన్‌ల ఆవిష్కరణ కార్యక్రమంలో వీసీ ముఖ్య అతిథిగా, గౌరవ అతిథులుగా రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ ఎల్.సుమలత, ఓఎస్డీ కోటేశ్వరరావు, డీఏపీ వెంకటరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ అందరి సమష్టి కృషి, సహకారంతో యూనివర్సిటీకి న్యాక్ ఏ+ గ్రేడ్, యూసీఈకే కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు లభించిందన్నారు. క్యాంపస్‌లో చేపట్టిన రహదారులు, డ్రైన్లను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. యూసీఈకేలో బీటెక్ సీఎస్ఈ(ఏఐఎంఎల్) కోర్సు, ఎమ్మెస్సీలో డేటా సైన్స్ కోర్సు, ఎంబీఏలో హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సులను ప్రారంభించి విద్యార్థులకు ప్రవేశాలు కల్పించామన్నారు. అనంతరం క్యాలెండర్, డైరీ, న్యూస్ మ్యాగజైన్‌లను వీసీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు డైరెక్టర్లు, ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వ్యక్తి నిర్బంధంపై వివాదం

పోలీసులపై టీడీపీ ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆగ్రహం



పోలీసులను ప్రశ్నిస్తున్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

పెదపూడి, జనవరి 1: పోలీసుస్టేషన్‌లో వ్యక్తిని నిర్బంధించడంపై వివాదం రాజుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా పెదపూడి మండలం గంగ్రేడుకు చెందిన వైసీపీ నాయకుడు పెంకే ఏకాశి అనే వీర వెంకట సత్యనారాయణ గంగ్రేడు సెంటర్ వద్ద పలావు సెంటర్ నడుపుతున్నాడు. వైసీపీ విజయానికి అన్ని విధాల కృషి చేసిన పెంకే ఏకాశి పార్టీలో పూర్తిగా నష్టపోయి తగిన గుర్తింపు లేక తన అనుచరులతో భారీ ఎత్తున టీడీపీలో చేరుటకు రంగం సిద్ధం చేసుకున్నారు. విషయం తెలిసిన గంగ్రేడు సర్పంచ్ కురుపూడి మాధవీలత భర్త శ్రీనివాస్ అనుచరుడు పిల్లి వెంకట్ గత నెల 31 మధ్యాహ్నం పలావు సెంటర్ వద్ద పెంకే ఏకాశితో ఘర్షణకు దిగాడు. అదే రోజు సాయంత్రం పిల్లి వెంకట్ పలావు సెంటర్ వద్దకు వెళ్లి పెంకే ఏకాశిపై దాడి చేయడంతో గాయపడిన ఏకాశి వైద్యం నిమిత్తం అదే రోజు రాత్రి 8.30 నిమిషాల సమయంలో కాకినాడ జీజీహెచ్‌కు వెళ్లగా అక్కడ చికిత్స అనంతరం ఎమ్మెల్సీ నమోదు చేశారు. విచారణ నిమిత్తం పెంకే ఏకాశిని పెదపూడి పోలీసులు స్టేషన్‌కు పిలిచి అక్కడ ఉంచారు. వైసీపీ నుంచి వెళ్లిపోతున్నాడనే కక్షతో అధికార పార్టీ నాయకులు ఒత్తిడి మేరకు ఎంతకూ పోలీసులు తనను విడుదల చేయకపోవడంతో విషయాన్ని పెంకే ఏకాశి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి తెలిపారు. విషయం తెలుసుకున్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఉదయం నుండి ఏకాశిని ఎందుకు నిర్బంధించారని ప్రశ్నించారు. గొడవపడ్డ ఇరుపార్టీలను స్టేషన్‌కు పిలిపించాలి కానీ ఒక్కరినే స్టేషన్‌కు పిలిచి నిర్బంధించడం ఏమిటని, నూతన సంవత్సరం సందర్భంగా అధికారులు అందుబాటులో ఉండరని తెలిసిన సమయంలో ఎందుకు ఏకాశిని స్టేషన్‌కు పిలిపించారని పోలీసులపై ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒత్తిళ్లకు తలొగ్గి విధులు నిర్వహిస్తే భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందన్నారు. అప్పుడు ఒత్తిడి తెచ్చిన వారు మిమ్మల్ని ఆదుకోలేరన్నారు. సాక్షాత్తు నల్లమిల్లే పూచీకత్తు ఇస్తాననడంతో ఏకాశిని పోలీసులు విడుదల చేయడంతో వివాదం సద్దుమణిగింది.

లారీ ఢీకొని యువకుడి మృతి



తునిరూరల్, జనవరి 1: కాకినాడ జిల్లా తుని పట్టణంలో సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. తుని సీతారామపురానికి చెందిన పి.గణేష్ (28) పెట్రోల్ పోయించుకుని ఇంటికి వెళుతుండగా పట్టణంలోని ఎల్ఐసీ బిల్డింగ్ వద్ద లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనపై తుని పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వైద్య విద్యార్థులకు తీవ్రగాయాలు

జీజీహెచ్ (కాకినాడ), జనవరి 1: కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ (పీజీ) చేస్తున్న ఇద్దరు వైద్య విద్యార్థులు సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలై కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. తమిళనాడుకు చెందిన 30 ఏళ్ల డా.అరుల్, 30 ఏళ్ల డా.అనుసత్య షణ్ముఖ సుందరన్ ఆర్ఎంసీలోని ఈఎన్‌టీ విభాగంలో మొదటి సంవత్సరం పీజీ వైద్య విద్యను అభ్యసిస్తున్నారు. వారిద్దరు జీజీహెచ్‌కు ఎదురుగా ఉన్న పీజీ హాస్టల్‌లో ఉంటూ చదువులో భాగంగా జీజీహెచ్‌లో విధులు నిర్వర్తిస్తుంటారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి హాస్టల్ నుంచి విధులకు హాజరయ్యేందుకు బైక్‌పై జీజీహెచ్‌కు వెళ్లే క్రమంలో రోడ్డు దాటుతుండగా మెయిన్ రోడ్డు వైపు నుంచి జిల్లా పరిషత్ వైపు వేగంగా వెళుతున్న మరో బైక్ వీరి బైక్‌ను బలంగా ఢీ కొట్టింది. దాంతో వైద్య విద్యార్థులు ఇరువురు చెల్లా చెదురుగా పడి తీవ్రంగా గాయపడ్డారు. అది గమనించిన స్థానికులు క్షతగాత్రులను అత్యవసర విభాగానికి తరలించగా అక్కడ వైద్యులు పలు వైద్య పరీక్షలు నిర్వర్తించి వైద్య చికిత్సను అందజేస్తున్నారు. అరుల్‌కు ఎడమ మోకాలు భాగం విరిగి, పాదం భాగం లో కన్నం పడి తీవ్ర రక్త స్రావం అయింది. అలాగే అనుసత్యకు ముఖం భాగంలో తీవ్ర గాయాలు అవడంతో ఈఎన్‌టీ వైద్యులు ప్రత్యేక వైద్య చికిత్సను అందజేస్తున్నారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాకినాడ

వికసిత్ భారత్ సంకల్పయాత్ర

ప్రత్తిపాడు, జనవరి 1: మండలంలోని గజ్జినపూడి, చింతలూరు గ్రామాల్లో సోమవారం వికసిత్ భారత్‌సంకల్పయాత్ర కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు ప్రధాని మోదీ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర ఏపీ సమగ్రాభివృద్ధికి కేంద్రప్రభుత్వం కేటాయింపులు చేపట్టిన పథకాలను వివరించారు. వికసిత్ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రెండు గ్రామాల ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

భగవంతుని ఆరాధనతో మంచి జరుగుతుంది

చాగంటి కోటేశ్వరరావు



మల్లవరంలో కల్యాణవేదికను ప్రారంభిస్తున్న చాగంటి కోటేశ్వరరావు

గొల్లప్రోలు రూరల్, జనవరి 1: భగవంతుని ఆరాధనతో జీవితంలో అంతా మంచి జరుగుతుందని ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు తెలిపారు. గొల్లప్రోలు మండలం ఆలవెల్లి మల్లవరంలో వేంచేసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన కల్యాణవేదికను సోమవారం ఆయన ప్రారంభించారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆరాధనతో అన్ని సమస్యలు దూరమవుతాయని తెలిపారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ధర్మవరంలో శోభాయాత్ర



ప్రత్తిపాడు, జనవరి 1: మండలంలోని ధర్మవరంలో సోమవారం రామభక్తులు శోభాయాత్ర నిర్వహించారు. మంగయమ్మపేట రామాలయం వద్ద అయోధ్య నుంచి తీసుకొచ్చిన అక్షింతలతో ఈ యాత్రను ప్రారంభించారు. యువతలు, మహిళలు కలశాలతో గ్రామ పురవీధుల్లో ఈ శోభయాత్రను కొనసాగించారు. అయోధ్య శ్రీరాముని అక్షింతలు బుధవారం నుంచి పంపిణీ చేస్తామని నిర్వాహకులు తెలిపారు. యాత్రలో సర్పంచ్ వి.సుశీల అబ్బాయి, గ్రామపెద్దలు దొడ్డిపట్ల సోమన్నదొర, జువ్వల చినబాబు, చుక్కల సత్యనారాయణ, సానా నూకారాజు, ఉప్పల తిరుపతయ్య, జాబు సూర్యనారాయణ, పంపనబోయిన భవాని, అనుసూరి నాగవేణి తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు జన సమీకరణపై సమావేశం

సామర్లకోట, జనవరి 1: సీఎం జగన్ ఈనెల 3న కాకినాడలో పర్యటించనున్నందున సామర్లకోట మండలం నుంచి గ్రామాల వారీగా జన సమీకరణ, తరలింపు, వారికి ఆహార సదుపాయాల కల్పనపై సోమవారం సామర్లకోట ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మండలస్థాయి అధికారుల సమీక్ష సమావేశం ఎంపీడీవో డి.శ్రీలలిత ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రత్యేకాధికారిగా పెద్దాపురం డీఎల్డీవో కెఎస్వీప్రసాదరావు మాట్లాడుతూ ప్రతీ గ్రామానికి బస్సులు, ఆటోలు తదితర వాహనాలు సమకూరుతాయని ఆయా పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు సమన్వయంతో జన సమీకరణ చేసి సీఎం సభకు తరలించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కె.హరికృష్ణ సత్యారెడ్డి, ఏవో మంగతాయారు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'రోడ్‌షోపై ప్రత్యేక దృష్టి పెట్టాలి'

కార్పొరేషన్ (కాకినాడ), జనవరి 1: ముఖ్యమంత్రి జగన్ రాక సందర్భంగా ఈనెల 3న ఏర్పాటు చేసిన రోడ్‌షోను విజయవంతం చేయాలని దానిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కమిషనర్ సీహెచ్.నాగనరసింహారావు అధికారులను ఆదేశించారు. స్మార్ట్‌సిటీ కార్యాలయంలో ఈ అంశంపై సోమవారం జిల్లా స్థాయి ప్రత్యేక అధికారులు, కార్పొరేషన్ స్పెషల్ ఆఫీసర్లు, ఆర్పీలతో ఆయన సమీక్ష నిర్వహించారు. హెలీప్యాడ్ నుంచి సభాస్థలివరకు ఏర్పాటు చేసిన రోడ్‌షోను విజయవంతం చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించి బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది ఈ అంశంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. సమావేశంలో పలువురు అధికారులు ఉన్నారు.

జగ్గంపేటలో అన్న క్యాంటీన్

జగ్గంపేట, జనవరి 1: స్థానిక ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద ప్రతి సోమవారం జరిగిలో టీడీపీ ఆధ్వర్యంలో జరిగే అన్న క్యాంటీన్‌లో సోమవారం టీడీపీ సీనియర్ నేత, దివంగత పల్లా రాంబాబు యాదవ్ కుమారుడు పల్లా మురళి ఆర్థిక సాయంతో భోజనాలు పేదలను ఏర్పాటు చేయగా టీడీపీ మండలాధ్యక్షుడు మారిశెట్టి భద్రం వడ్డించారు. జనసేన, టీడీపీ సంకీర్ణ ప్రభుత్వంలో మళ్లీ అన్న క్యాంటీన్లు ఏర్పాటు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కొత్త కొండబాబు, దేగల సత్తిబాబు, వేములకొండ జోగారావు, బద్ది సురేష్, కోడూరి రమేష్, ఎండీ కాజా, నండ్ల చిరంజీవి, సాంబత్తుల చంద్రశేఖర్, బద్ది గిరి, గొర్రెల ప్రేమ స్వరూప్ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంఘాల ఆందోళన

ప్రత్తిపాడు, జనవరి 1: ప్రజా వ్యతిరేక టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఐలాజ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్తిపాడులో ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ నాయకులు బుగతా శివ, అవసరాల దేవి నాయకత్వంలో ప్రజాసంఘాల ప్రతినిధులు అంబేద్కర్ సెంటర్ వద్ద టైటిలింగ్ చట్టం వల్ల సామాన్యులకు న్యాయం దూరవుతుందని ఆందోళన చేపట్టారు. ఈ చట్టం పెట్టుబడుదారులు, కార్పొరేటర్లకు ఉచితంగా భూమి పంపిణీకి ఉద్దేశించిందని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో ప్రజా సంఘాల తరుపున సింహాచలం, లచ్చబాబు, నాగేశ్వరరావు ఉన్నారు.

పాళమ్మతల్లి గుడి పునర్నిర్మాణం పూర్తి

కరప, జనవరి 1: మండలంలోని పెనుగుదురు గ్రామదేవత పాళమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణం పనులు పూర్తయ్యాయి. ఈనెల 4న ఉదయం 8.13గంటలకు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, శ్రీవిద్య దంపతులు చేతులమీదుగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించేందుకు సర్పంచ్ రెడ్డిపల్లి వెంకట మాధవి, ఎంపీటీసీ సభ్యురాలు బండారు సుజాతల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. పూజాధికాలను కోనసీమ వాస్తవ్యులు బ్రహ్మశ్రీ ఉపద్రష్ట లక్ష్మీనరసింహశాస్త్రి ఆధ్వర్యంలో బ్రహ్మత్వములోని వేద విధులు, స్మార్త పండితులు, ఎవిద్యాపూర్ణ దీక్షా పరుల పర్యవేక్షణలో స్మార్త, ఆగమన విధానంలో ఈనెల 2,3న నిర్వహిస్తారు.4నపాలమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుంది.

శేషారెడ్డి జన్మదినం

గండేపల్లి, జనవరి 1: సూరంపాలెంలో ఆదిత్య విద్యాసంస్థల అధినేత శేషారెడ్డి జన్మదిన, నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. విద్యా సంస్థల్లో 70 విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆదిత్య రవాణా విభాగం అధిపతి సీహెచ్.వెంకటరెడ్డి ఆధ్వర్యంలో బస్ ఆకృతిలో కేక్‌ను తయారు చేయించి కట్ చేశారు. కార్యక్రమంలో ఆదిత్య అధినేత్రి లక్ష్మీరాజ్యం, వైస్ చైర్మన్ సతీష్‌రెడ్డి దంపతులు, కార్యదర్శి దీపక్‌రెడ్డి పాల్గొన్నారు.

హరిదాసుకు సన్మానం

ప్రత్తిపాడు, జనవరి 1: మండలంలోని ధర్మవరం జువ్వల వారి రామాలయం వద్ద సోమవారం శ్రీ వీర వెంకట విజయదుర్గ నాట్యమండలి అధ్యక్షుడు సానా నూకరాజు నాయుడు ఆధ్వర్యంలో స్థానిక హరిదాసు కృష్ణదాసును శాలువాతో సత్కరించి నగదు బహూకరించారు. కార్యక్రమంలో సిద్దా పెద్దకాపు, జాబు సూర్యనారాయణ, వార్డు మెంబర్ కోన సత్తిబాబు, జువ్వల నాగు, తూపాటి బాలయ్య, సత్తిరాజు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా కొత్త వీర్రాజు

గండేపల్లి, జనవరి 1: ఆర్యవైశ్య సంఘ మల్లేపల్లి అధ్యక్షుడిగా కొత్త వీర్రాజు నియమితులైనట్టు ఉమ్మడి జిల్లాల ఆర్యవైశ్య సంఘ కార్యవర్గ వర్గ సభ్యులు బూర్లు సాయి తెలిపారు. అధ్యక్షుడిగా ఎంపికైన వీర్రాజును అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: డెవిల్, బబుల్‌గమ్, యానిమల్, హాయ్ నాన్న, ఆక్వామెన్

తిరుమల	:	డెవిల్
లక్ష్మి	:	డెవిల్
సీ అండ్‌సీ1	:	ఆక్వామెన్
సీ అండ్‌సీ2	:	సలార్
శ్రీప్రియ	:	యానిమల్
పద్మప్రియ	:	సలార్
సత్యగౌరి	:	సలార్
సూర్య 1	:	ఆక్వామెన్
సూర్య 2	:	సలార్

'మెరుగైన సేవలందించాలి'

కార్పొరేషన్ (కాకినాడ), జనవరి 1: ప్రజలకు చేరువుగా మరిన్ని మెరుగైన సేవలందించే దిశగా ప్రతీ అధికారి సిబ్బంది పనిచేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్.నాగనరసింహారావు కోరారు. నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం జరిగిన వేడుకలలో ఆయన పాల్గొన్నారు. పలువురు అధికారులు, నాయకులు పుష్పగుచ్ఛాలతో ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. వివిధ విభాగాల అధికారులతో కలిసి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



పిఠాపురంలో మాజీ ఎమ్మెల్యే వర్మకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు, కార్యకర్తలు



జగ్గంపేట : జ్యోతుల నెహ్రూకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

» రాజకీయ నాయకులకు శుభాకాంక్షలు తెలిపిన అభిమానులు, కార్యకర్తలు

» కేక్ కటింగ్‌లు, ఇళ్ల వద్ద రంగవల్లులు

పిఠాపురం, జనవరి 1: జిల్లాలో సోమవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. పిఠాపురం పురపాలకసంఘ కార్యాలయం వద్ద గల పాత తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ పాల్గొన్నారు. భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ వర్గాల ప్రజలు వర్మను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. గజమాలలతో సత్కరించారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య కేక్ కట్ చేశారు. ఆర్టీసీ కాంప్లెక్సు సమీపంలోని జనసేన పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించిన వేడుకలకు నాయకులు, కార్యకర్తలు, అభి మానులు, జనసైనికులు భారీగా తరలివచ్చి పిఠాపురం ఇన్‌చార్జి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు. జనసైనికులతో కలిసి ఉదయ శ్రీనివాస్ కేక్‌ను కట్ చేశారు.

సర్పవరం జంక్షన్: వలసపాకలలో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు మాజీ ఎమ్మెల్యే దంపతులకు పుష్పగుచ్ఛాలు, బొకేలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. రమణయ్యపేట టీడీపీ కార్యాలయంలో మాజీ ఎంపీపీ వాసిరెడ్డి ఏసుదాసు, అశోక్‌నగర్‌లో జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస బాబా ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. కార్యకర్తలు, నాయకులు పుష్పగుచ్ఛాలు అందించారు. గొడారిగుంటలో జనసేన రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, పీఏసీ సభ్యుడు పంతం నానాజీ ఆధ్వర్యంలో వేడుకలు నియోజకవర్గం నలుమూలల నుంచి వేలాది మంది పార్టీ కార్యకర్తలు, నాయకులు తరలివచ్చి నానాజీకి బొకేలు, పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

తుని రూరల్: తుని పట్టణ శివారు సాయివేదికలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు సారథ్యంలో తుని ఇన్‌చార్జి దివ్య చేపట్టిన వేడుకలకు పెద్ద ఎత్తున అభిమానులు, కార్యకర్తలు తరలివచ్చారు. వేడుకలో మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, యనమల కృష్ణుడు, యనమల దివ్యను కార్యకర్తలు గజమాలతో సత్కరించి కేక్ కట్ చేయించారు. టీడీపీ నాయకులు పోల్నాటి శేషగిరిరావు, సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, చింతమనీడి నాగ సోమరాజు (అబ్బాయి), ఇనుగంటి సత్యనారాయణ, మురాల శెట్టి సత్యనారాయణ శుభాకాంక్షలు తెలిపినవారిలో ఉన్నారు.

కరప: మండలంలో గ్రామాల్లో కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ మహిళలు ఇళ్ల ముందు రంగు రంగవల్లులతో తీర్చిదిద్దారు. అర్ధరాత్రి 12గంటలకు యువత రోడ్లపైకి వచ్చి కేరింతలు కొడుతూ హడావిడి చేశారు. వాహనాలను ఆపి స్వీట్లు పంచారు. కరప ఎస్ఐ టి.రామకృష్ణ సిబ్బందితో పెట్రోలింగ్ జరిపి శాంతిభద్రతలు పర్యవేక్షించారు. సోమవారం మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ, వైసీపీ నాయకులు, కార్యకర్తలు అధికారులు కాకినాడ వెళ్లి ఎమ్మెల్యే కన్నబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. జడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు, ఆచార్య ఎన్జీ రంగా వర్శిటీ డైరెక్టర్ చింతా ఈశ్వరరావు, మండల యువజన విభాగ అధ్యక్షులు పెంకే సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో స్థానిక టీడీపీ నేత, అమలాపురం నియోజకవర్గ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజును ధర్మవరం సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి, దళిత నాయకులు, అభిమానులు, కార్యకర్తలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్తిపాడులో బీసీవై నేత గొంప శివకుమార్ అభిమానులు, కార్యకర్తలకు అన్నదానం నిర్వహించారు. కేక్ కట్ చేసి వేడుకలు ప్రారంభించారు. ప్రత్తిపాడు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ఉమ్మడి వెంకట్రావు, పీసీసీ సభ్యుడు ధర్నాలకోట శ్రీను, కేకు కట్ చేసి అభిమానులకు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. పార్టీ నాయకులు మొయ్యేటి సూర్యప్రకాష్ రావు, కొప్పన కోటేశ్వరరావు, కొల్లు వీర గణేష్ ఉన్నారు.

జగ్గంపేట: మండలంలోని ఇర్రిపాకలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ, జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ నూతన సంవత్సర వేడుకలు నిరాడబరంగా నిర్వహించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, జనసైనికులు వారికి శుభాకాంక్షలు తెలిపారు. అక్కడే కోటి మట్టి శివలింగాల తయారీలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఎమ్మెల్యే చంటిబాబు ఇంటి వద్ద నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. జేవీఆర్ గ్రూప్స్ అధినేత, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి జీను మణిబాబుకు టీడీపీ నేతలు శుభాకాంక్షలు తెలిపారు.

గండేపల్లి: మండలం ఆదివారం రాత్రి యువత, మహిళలు ఇళ్ల వద్ద రంగవల్లులు వేశారు. సోమవారం వివిధ పార్టీల అభిమానులు, కార్యకర్తలు తమ నాయకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

అన్నవరం: అన్నవరం దేవస్థానంలో వేడుకలు ఘనంగా జరిగాయి. చైర్మన్ బంగ్లాకు, ఈవో కార్యాలయానికి ఉద్యోగులు, సిబ్బంది, పార్టీలకతీతంగా నాయకులు వెళ్లి చైర్మన్ రోహిత్, ఈవో రామచంద్రమోహన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈవో, చైర్మన్‌లు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్, మంత్రి దాడిశెట్టి రాజాలను కలిసి శుభాకాంక్షలు అందజేశారు.

సామర్లకోట: మండలంలోని అచ్చంపేటలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప స్వగృహం ఆవరణలో రాజప్పను పెద్దాపురం నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పూలమాలలతో ముంచెత్తి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అభిమానులు తీసుకువచ్చిన కేకులను కట్ చేసి రాజప్ప అందించారు. కార్యకర్తలకు విందు భోజనాలు ఏర్పాటు చేశారు. డబుల్ సెవెన రాజు, రంగనాగ్ పాల్గొన్నారు. సామర్లకోటలో హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు స్వగృహంలో దొరబాబును పలువురు నాయకులు పూలమాలలతో అభినందించారు.

పెద్దాపురం: పులిమేరు గ్రామంలో జనసేన పార్టీ నియోజకర్గ ఇన్‌చార్జ్ తుమ్మల రామస్వామి (బాబు) ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారీ కేకును కట్ చేసి నూతన సంవత్సరానికి ఆహ్వానం పలికారు. పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలియచేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఏపీఎన్జీవో కార్యాలయంలో సంఘ అధ్యక్షుడు డి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు ప్రమోద్, సత్యనారాయణ, సాయి, ఉమాదేవి, వహీదాబాను, జీవన్, మేనేజర్ జ్యోతీరాణి తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం స్వగృహంలో ఆయన తనయుడు గిరిబాబు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. వీరవరంలో మాజీ మంత్రి తోట నరసింహం స్వగృహంలో నాయకులను గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కిర్లంపూడిలో జగపతినగరం సర్పంచ్ శ్రీలతా రాంబాబు గ్రామ పంచాయతీలో, టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు స్వగృహంలో, కిర్లంపూడి సొసైటీ చైర్మన్ చదలవాడ బాబి స్వగృహం వద్ద వేడుకలు నిర్వహించారు.

తాళ్లరేవు: తాళ్లరేవు నుంచి భారీసంఖ్యలో టీడీపీ నేతలు, కార్యకర్తలు మురమళ్ల వెళ్లారు. మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబును టీడీపీ నేతలు, కార్యకర్తలు టీడీపీ నేత కంచర్ల లక్ష్మణరావు ఆధ్వర్యంలో రూ.50వేలు విలువచేసే పూలతో ముంచెత్తి శుభాకాంక్షలు తెలిపారు.

పెదపూడి: టీడీపీ నాయకులు పుట్టా గంగాధర చౌదరి, జుత్తుక కృష్ణ, కొటికలపూడి సత్తిబాబు, పైన్ని బాబు, మెర్ల ప్రభాకర చౌదరి, తమలంపూడి శివరామారెడ్డి, కాకర గోవిందు, అరుమిల్లి ప్రసాద్‌చౌదరి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బొడ్డు అనంత వెంకటరమణ చౌదరిలకు శుభాకాంక్షలు తెలిపారు.

కొత్తపల్లి: వాకతిప్పలో టీడీపీ నియోజకవర్గ తెలుగునాడు విద్యార్థి సంఘ అధ్యక్షుడు రావు అక్షయ్, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, వైసీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. చిన్నారులు గ్రీటింగ్, చెక్లెట్‌లతో నాయకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. నాగులాపల్లిలో వైసీపీ నేత వడిశెట్టి నారాయణరెడ్డి వేడుకలు నిర్వహించారు.

రౌతులపూడి: రౌతులపూడి టీడీపీ నేతలు మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు, గంటా గోపీ, అల్లు బుజ్జి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడికి శుభాకాంక్షలు తెలిపారు.



సామర్లకోట: రాజప్పకు శుభాకాంక్షలు చెబుతున్న దృశ్యం



తాళ్లరేవు: దాట్లను పువ్వులతో ముంచెత్తిన కార్యకర్తలు



పెదపూడి: టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లికి శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు



సర్పవరం జంక్షన్: యనమలకు గజమాలతో శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు



రౌతులపూడి: అయ్యన్నపాత్రుడికి శుభాకాంక్షలు తెలుపుతున్న రౌతులపూడి టీడీపీ నేతలు

టీడీపీలో వైసీపీ నేత బాబ్జి చేరిక



జ్యోతుల నవీన్‌తో వంటిపల్లి బాబ్జి

జగ్గంపేట, జనవరి 1: మండలంలో రామవరం గ్రామానికి చెందిన వైసీపీ యువనేత వంటిపల్లి బాబ్జి రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు అడబాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఇర్రిపాకలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ, జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ సమక్షంలో వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. ఆయనకు నెహ్రూ టీడీపీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. బాబ్జి మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్లుగా రామవరం ఏ ఒక్క అభివృద్ధి కార్యక్రమానికి నోచుకోలేదని టీడీపీలో నెహ్రూ చేసిన అభివృద్ధి తప్ప ఎక్కడ ఒక రోడ్డుకానీ, డ్రైనేజీ కానీ నిర్మించలేదన్నారు. నెహ్రూ గెలుపుతోనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది అనే ఉద్దేశ్యంతో ఆయన నాయకత్వంలో పని చేయడానికి పార్టీలో చేరామన్నారు. మండపాక వెంకటాచలం, మండపాక పాపారావు, వార్డు మెంబర్ మండపాక వెంకటేశ్వరరావు, అడబాల పెద్దబాబు, అడబాల సూరిబాబు, పెద్దకాపు, అడబాల పకీరయ్య ఉన్నారు.

జనసేనలో చేరికలు

సర్పవరం జంక్షన్, జనవరి 1: కాకినాడ రూరల్ తూరంగి శివారు డ్రైవర్స్ కాలనీకి చెందిన సుమారు 300 మంది గ్రామస్థులు, యువకులు, మహిళలు జనసేన పార్టీలో చేరారు. గొడారిగుంట జనసేన కార్యాలయంలో కక్కల దుర్గా, బొండల చిన్నా, బడేకృష్ణలతో పాటు గ్రామస్థులకు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. సర్పవరంకు చెందిన వైసీపీ నాయకుడు, గ్రామ 11వార్డు సభ్యులు పులగల నాగేశ్వరరావు పార్టీలో చేరారు. రాబోయే ఎన్నికల్లో జనసేన బలోపేతానికి కృషి చేయాలని కోరారు. టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పుల్ల శ్రీరాములు, ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ పుల్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సానా సతీష్‌బాబు ఫౌండేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

కాకినాడ సిటీ, జనవరి 1: మీరు మేము మనం ప్రతి స్వప్నం, ప్రతి గళం, ప్రతి ఆశయం, మన కాకినాడ జిల్లా కోసం అనే నినాదంతో సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ముద్రించిన 2024 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. స్థానిక శాంతినగర్‌లోని ఫౌండేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ముఖ్య ఆహ్వానితుడిగా మాజీ డిప్యూటీ మేయర్ అరిగెల శ్రీనివాస్ (బున్ని) హాజరై ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి క్యాలండర్‌ను విడుదల చేశారు. జిల్లాను అభివృద్ధి పథకంలో తీసుకెళ్లేందుకు జిల్లా వాసులంతా ఏకతాటిపైకి వచ్చి పనిచేయాలని కోరారు. అందుకోసం సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ప్రణాళికాబద్ధంగా పనిచేయడం అభినందనీయమన్నారు. ఫౌండేషన్ ప్రతినిధులు వెన్నెపు చక్రధర్, గుత్తుల రమణ, కేవీవీ.సత్యనారాయణ, సభ్యులు ఉన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ మేయర్

ఆలయాలకు పోటెత్తిన భక్తులు



సామర్లకోట: విశేష పూజల్లో భీమేశ్వరుడు



పిఠాపురంలో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

పిఠాపురం, జనవరి 1: నూతన సంవత్సర వేళ పిఠాపురంలోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పాదగయ క్షేత్రానికి సోమవారం తెల్లవారుజాము నుంచే భక్తుల రాక ప్రారంభమైంది. పుష్కరిణిలో స్నానాలు ఆచరించి ఆలయంలో ప్రదిక్షిణలు చేశారు. సోమవారం కావడంతో కుక్కుటేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహించారు. రాజరాజేశ్వరీ దేవి, పురుహుతికాఅమ్మవార్లకు కుంకుమార్చన జరిగింది. భక్తుల రద్దీ రాత్రి వరకూ కొనసాగింది. భక్తులకు అసౌకర్యం కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానం, కుంతీమాధవస్వామి దేవస్థానం, కోటగుమ్మం సెంటర్‌లోని జైగణేష్ ఆలయం, టీటీడీ నిర్వహణలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలోనూ రద్దీ ఉంది. దర్శనాల కోసం భక్తులు బారులు తీరారు.

భీమేశ్వరాలయంలో విశేష పూజలు

సామర్లకోట, జనవరి 1: సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో నూతన సంవత్సరం, ధనుర్మాస పవిత్ర సోమవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ పండితులు ముందుగా భీమేశ్వరస్వామికి పంచద్రవ్యాలతో అభిషేకించి విశేష పుష్పార్చన పూజలు చేశారు. భక్తులు తెల్లవారుజామున 5 గంటలకే ఆలయానికి చేరుకున్నారు. అన్నప్రసాదాలను స్వీకరించారు.బాలాత్రిపుర సుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన పూజలు జరిగాయి. అనంతరం స్వామి,అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో సుందరంగా అలంకరించారు.

తుని రూరల్‌లో...

తుని రూరల్, జనవరి 1: నూతన సంవత్సరం సందర్భంగా లోవ దేవస్థానం, తపోవనం పీఠం, ఎస్.అన్నవరంలో శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలందజేశారు.

కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి

డాక్టర్ ఉమర్‌ఆలీషా



పిఠాపురంలో మాట్లాడుతున్న ఉమర్‌ఆలీషా

పిఠాపురం, జనవరి 1: మానవుడు కాలాన్ని సద్వినియోగం చేసుకుని ఆధ్యాత్మికత, మానవతా విలువలతో సుఖమయ జీవనం గడపాలని విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా అన్నారు. పిఠాపురం పట్టణ శివారులోని పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణంలో నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక సభలో భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణ చేశారు. ప్రతి ఒక్కరు మూడు మొక్కలు నాటి నా మొక్క నా శ్వాస కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఆధ్యాత్మిక జ్ఞానమనే పంట ద్వారా శాంతి, సుస్థిరత, జీవితాల్లో ప్రశాంతత నెలకొల్పేందుకు పీఠం కృషి చేస్తున్నదని తెలిపారు. ఉమర్‌ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ద్వారా పక్షులకు ఆహారంగా ధాన్యపు కుచ్చులను అందజేశారు. సభలో పర్యావరణ పరిరక్షణ ఉద్యమకారుడు, రచయిత డాక్టర్ తల్లావజ్ఝల పతంజలి శాస్త్రి, జి.రామప్రసాద్, ఏవీవీ సత్యనారాయణ, డాక్టర్ పింగళి ఆనందకుమార్, ప్రసాద్‌వర్మ, అవదాని యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు, పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇసుకను కొల్లగొడుతున్న సీఎం జగన్

జనసేన సిటీ ఇన్‌చార్జి ముత్త శశిదర్



మట్టిపాత్రల తయారీ విధానాన్ని పరిశీలిస్తున్న ముత్త శశిదర్

కార్పొరేషన్ (కాకినాడ), జనవరి 1: జనసేన పార్టీ పీఏసీ సభ్యుడు, సిటీ ఇన్‌చార్జి ముత్తశశిదర్ సోమవారం జగన్నాధపురంలోని శాలివాహన కుటుంబాలను సందర్శించారు. మట్టిపాత్రల తయారీ విధానాన్ని పరిశీలించారు. మట్టిపాత్రలు తయారు చేసుకునే ఈ వృత్తివారికి తయారీకి కావలసిన మట్టిని తెచ్చుకునేందుకు జీవో ఉన్నప్పటికి వైసీపీ ప్రభుత్వం వారిపై తప్పుడు కేసులు బనాయించడం సరికాదని శశిదర్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇసుకను కొల్లగొడుతు కోట్లాది రూపాయలు జేబులో వేసుకుంటున్న ప్రశ్నించేవారు లేరన్నారు. కొత్త సంవత్సరంలోకి వస్తూ ప్రజల కులవృత్తులను కాపాడుకోవాలని తమ అధినేత పవన్‌కల్యాణ్ తెలిపారన్నారు. విభిన్నకులాల సమూహామే ఈ సమాజమన్నారు. జనసేన నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల నిరసన



ఒంటికాలిపై నిలబడి నిరసన తెలుపుతున్న కార్మికులు

గొల్లప్రోలు, జనవరి 1: డిమాండ్ల పరిష్కారం కోరుతూ నిరవధిక సమ్మె చేస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సోమవారం వినూత్నరీతిలో నిరసన తెలిపారు. గొల్లప్రోలు నగరపంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన నిరసన శిబిరం వద్ద ఒంటికాలిపై నిలబడి దండం పెడుతూ తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, చనిపోయిన కార్మికుల కుటుంబసభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఆందోళనలో శానిటేషన్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సీహెచ్‌వీ రమణ ఏసమ్మ, సీఐటీయూ నాయకుడు నందీశ్వరరావు, సత్యవతి, రాజమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిరసన దీక్షలు

తుని రూరల్, జనవరి 1: అంగన్‌వాడీలు తలపెట్టిన నిరసన దీక్షలు 21వ రోజుకు చేరుకున్నాయి. తునిలో దీక్షా శిబిరం వద్ద అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు సీపీఐ ఎంఎల్ లో గోలకు రంగులు వేసి తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. దీంతో వారికి తుని, గ్రామీణ ప్రాంత విశ్రాంత ఉద్యోగుల సంఘం సభ్యులు మద్దతుగా నిలిచారు.

ప్రత్తిపాడు: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఆందోళనకు యూటీఎఫ్ నాయకులు కోడి శ్రీనివాసరావు, దొడ్డి పట్ల రాజబాబు, రామలింగేశ్వరరావు, ఆల్‌ఇండియా లాయర్స్ యూనియన్ నాయకులు వి.శివ, దేవి, సీఐటీయూ మండల మండల కార్యదర్శి రొంగల ఈశ్వరరావు, బీసీవై పార్టీ నేత గొంప శివకుమార్ మద్దతు తెలిపి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

నూతన వస్త్రాల పంపిణీ

కార్పొరేషన్ (కాకినాడ) జనవరి 1: నూతన సంవత్సరం ప్రజలందరిల్లో నూతన కాంతులు నింపాలని ప్రతీ కుటుంబం సంతోషంగా ఉండాలని రమ్యహాస్పటల్ అధినేత డాక్టర్ పితాని అన్నవరం అన్నారు. పితాని అన్నవరం చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం పలువురు రూరల్ నాయకులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతు తమ ట్రస్ట్‌ద్వారా సేవా కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో వాసంశెట్టి బీమారావు, కర్రి గోపాలకృష్ణ, కేత వీరబాబు, వనుము గంగారామ్ తదితరులు పాల్గొన్నారు.

చీరల అందజేత

తాళ్లరేవు, జనవరి 1: తాళ్లరేవు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చోడే శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం లయన్స్ గవర్నర్ ఏలూరి సూర్యనారాయణ దంపతులుతో 300మంది పేదలకు చీరలు అందజేశారు. కేసవస్వామి దేవస్థానంలో మొక్కలు నాటారు. డయోబిటిక్ రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి, నున్న దత్తు, సామా భగవాన్, నడింపల్లి వినోద్, ధూళిపూడి వెంకటరమణ తదితరులు ఉన్నారు.

గొడుగుల పంపిణీ

ప్రత్తిపాడు, జనవరి 1: ప్రత్తిపాడులో నిరుపేద తోపుడు బండ్ల కార్మికులకు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఇంజనీర్ మోహన్ గొడుగులు పంపిణీ చేశారు. ప్రత్తిపాడు లయన్స్ క్లబ్ స్థాపించి సిల్వర్ జూబ్లీ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. లయన్స్ క్లబ్ సభ్యులున్నారు.